# ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయాలి

- గుర్తింపు లేని ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి
- పిడియస్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. సంధ్య, కాంపాటి పృధ్వీ




**శామ్, జూన్11(కెరటం ప్రతినిధి)**

ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయాలని గుర్తింపు లేని ప్రైవేట్ విద్యాసంస్థలను తక్షణమే రద్దు చేయాలని పిడియస్‌యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. సంధ్య కాంపాటి పృధ్వీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లందు పట్టణం ఎల్లన విజ్ఞాన భవన్‌లో శనివారం కొత్తగూడెం డివిజన్ ముఖ్యుల సమావేశం యనగంటి వంశివర్ధన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ళలో ఫీజుల మోత మోగిపోతుందని ఇది విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారుతున్నా విద్యాశాఖ అధికారులు కానీ ప్రభుత్వం గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనియమని వారు అన్నారు. ఫీజులను కట్టడి చేస్తామంటూ తొమ్మిదేళ్ల నుంచి చెబుతున్న మాటలను ప్రభుత్వం ఆచరణలో పెట్టడం లేదని, తిరుపతిరావు కమిటీ అంటూ కొన్ని రోజులు, మంత్రుల కమిటీ అంటూ కొన్ని రోజులు ప్రభుత్వం కాలయాపన చేస్తుంది తప్ప ఫీజుల నియంత్రణ చట్టాన్ని చేయడం లేదని వారన్నారు. అడ్మిషన్లకు వెళ్లిన తల్లిదండ్రులకు ఫీజులు చూస్తే దిమ్మ తిరిగిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, బూట్లు,టై, బెల్ట్ వరకు ఇష్టం వచ్చిన రేటు పెట్టి అమ్ముతున్నారని అన్నారు. స్కూళ్లకు మౌలిక సదుపాయాలు లేకపోయినా సేఫ్టీ లేనటువంటి ప్రదేశాలలో స్కూళ్లను నియమించినా అధికారులు అనుమతులు ఎందుకు ఇస్తున్నారని వారు ప్రశ్నించారు. తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని చేయాలని గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యనగంటి వంశవర్ధన్, పార్థసారథి, సాయి, గంగాధర గణేష్, ఉదయ్, సుమిత్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఖమ్మం గడ్డ కమలానికి అడ్డా

- ఈ నెల 15న ఖమ్మం అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయండి
- మోడీ పరిపాలనలో సాధించిన ప్రగతి ప్రజలకు తెలియజేసేలా ఏర్పాటు
- కార్యకర్తలకు భరోసా ఇచ్చేవిధంగా బహిరంగ సభ
- పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్త నుండి భారీ జన సమీకరణ
- అమీషా సభ విజయవంతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలి
- బీజేపీ జాతీయ మీడియా సెల్ కోర్డినేటర్ ఓబీసీ కె.వి. రంగాకిరణ్

**శామ్, జూన్11(కెరటం ప్రతినిధి)**

ఈనెల 15న ఖమ్మంలో జరిగే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ మీడియా సెల్ కోర్డినేటర్, ఓబీసీ కె.వి రంగా కిరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా 9 తొమ్మిది సంవత్సరాల నరేంద్ర మోడీ పరిపాలనలో సాధించిన ప్రగతి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసే విధంగా ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందని, అందులో భాగంగా ఈనెల 15 గురువారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మం పట్టణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం అయిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడం కొరకు నిన్న ఖమ్మం వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సన్నాహ సమావేశ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొనడంతో బహిరంగ సభ విజయవంతం అవుతుందని బండి సంజయ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ప్రతి కార్యకర్త ఒక్కొక్కరు కనీసం 10 మంది కార్యకర్తలకు తగ్గకుండా ఈ భారీ బహిరంగ సభకు తరలించి సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రంగాకిరణ్ కోరారు.

ఖమ్మంలో బిజెపి ఎక్కడుంది అనే వారికి గతంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించి కనువిప్పు కలిగించామని, అదేవిదంగా ఈనెల 15 న జరిగే సభ ద్వారా త్వరలో జరగబోయే ఎన్నికల్లో జాతీయ, రాష్ట్ర పార్టీ నేతలకు ఖమ్మం కమలానికి అడ్డా కాబోతుందని భరోసా ఇచ్చే విదంగా బహిరంగ సభ జరుగబోతుందని, ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం విజయవంతానికి పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్త నుండి మండలాల వారిగా, అసెంబ్లీల వారీగా, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల వరకు జన సమీకరణ చేయడంలో పూర్తి స్థాయిలో సమ యం కేటాయించి, అమీషా సభ విజయ వంతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు.





## వెయ్యి కిలోమీటర్లకు చేరుకున్న భట్టి పాదయాత్ర

**కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు**

**శామ్, జూన్11(కెరటం ప్రతినిధి)**

సిఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తిచేసుకున్న సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఉపాధిహామీ కార్మికులతో కలిసి నాగా సీతారాములు కేక్ కట్ చేయించారు. మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పిప్పిరి గ్రామం నుంచి మొదలైన పాదయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాల్లో పాదయాత్ర చేస్తు ప్రభుత్వాలు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరిగి కాంగ్రెస్ పాలన ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకోవాలని మండుటెండలు, వర్షాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ముందుకు సాగుతున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ ఎండి కరీమ్ పాష, సుజాతనగర్ మండల కాంగ్రెస్ ఓబిసి అధ్యక్షులు కసనబోయిన లక్ష్మణ్, గ్రామ కమిటీ అధ్యక్షులు రెడ్డి బోయిన వెంకన్న, యరా వెంకన్న, మదనాల సైదులు, బాలు చిన్నభద్రం, గజ్జి సైదులు, కసనబోయిన సైదులు, లింగయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు చిన్న లింగన్న, ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.






## హైటెక్స్‌లో అతిపెద్ద ప్రాపర్టీ ఎక్స్‌పో

**హైదరాబాద్, జూన్11(కెరటం ప్రతినిధి)**

నగరంలో అతిపెద్ద ప్రాపర్టీ ఎక్స్‌పో ది టైమ్స్ హోమ్ హంట్ ఎక్స్‌పో 2023ను చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, శ్రీ రంజిత్ రెడ్డి మరియు నగర మేయర్, శ్రీమతి గద్వాల విజయలక్ష్మీ మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఎక్స్‌పో యొక్క 3వ ఎడిషన్ 2023 జూన్ 10 మరియు 11వ తేదీలలో ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు జరుగుతుంది, ప్రవేశం అందరికీ పూర్తిగా ఉచితం. అసాధారణ శ్రేణికి చెందిన విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు మొదలుకుని సొగసైన విల్లాలు మరియు ప్రైమ్ రెసిడెన్షియల్ ప్లాట్‌ల వరకు ప్రీమియం వెంచర్‌లను 36 ప్రముఖ బిల్డర్‌లు మరియు 100కి పైగా రియల్-ఎస్టేట్ ప్రాజెక్ట్‌లు ఈ ఎక్స్ పోలో ప్రదర్శితం అవుతున్నాయి. ఎక్స్‌పోను సందర్శించే వారి ప్రాధాన్యతలు, అవసరాలకు అనుగుణంగా విభిన్నమైన ప్రాపర్టీల ఎంపికలు వారికి అందుబాటులో ఉన్నాయి.